'కోత'లయ్యాకే పెట్టుబడి సాయం!

సెప్టెంబర్ దాకా రైతుభరోసా లేనట్టే?

- పథకం అమలుపై 'చర్చల' మెలిక
- ప్రక్రియ పూర్తికి కనీసం రెండు నెలలు పట్టే అవకాశం
- సీఎం ప్రకటనతో రైతుల్లో నిరాశ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రైతుభరోసాకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన అన్నదాతలను నిరాశ పరిచింది. ఈసారి కూడా పెట్టుబడి సాయం విత్తన దశలో కాకుండా, కోతల దశలో వస్తుందేమోననే చర్చ మొదలైంది. జూన్‌లోనే వానకాలం పెట్టుబడి సాయం పంపిణీని ప్రారంభించాల్సి ఉంటుంది. కానీ, ప్రభుత్వం 'చర్చల' పేరుతో పెట్టిన మెలికతో సెప్టెంబర్ వరకు రైతుభరోసా అందే అవకాశం లేదని వ్యవసాయ, ఆర్థికరంగ నిపుణులు భావిస్తున్నారు. రైతుభరోసా మార్గదర్శకాలపై క్యాబినెట్ సబ్ కమిటీని నియమిస్తున్నామని, ఈ కమిటీ జూలై 15 నాటికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుందని సీఎం చెప్పారు. ఆ తర్వాత ఈ నివేదికను అసెంబ్లీలో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు అంటే, అసెంబ్లీ సమావేశాలు పూర్తయి, ప్రభుత్వం నిర్ణయం తీసుకునేలోగా జూలై నెల ముగుస్తుంది. ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అధికారులు కొత్త నిబంధనలను రూపొందించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అర్హుల జాబితాను రూపొందించాలి. వాటిని గ్రామాలవారీగా ప్రదర్శించి, రైతుల నుంచి ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించి, మార్పులు చేయాల్సి ఉంటుంది.

కౌలు రైతుల గుర్తింపు ఎలా?

రైతుభరోసా కింద కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం ఇస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. వారిని ఎలా గుర్తిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కౌలు సమయంలో రైతుల నుంచి అఫిడవిట్లు తీసుకున్న కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ లెక్కన కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉంటుంది. ఆ జాబితాపై అభ్యంతరాలు వ్యక్తమయ్యే క్రమంలో పరిష్కరించే బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉండనున్నది. చివరగా.. కొత్తగా అర్హుల జాబితా, కౌలు రైతుల జాబితాను క్రోడీకరించి, ఒకే భూమికి ఇద్దరికి పెట్టుబడి సాయం అందకుండా వడబోయాల్సి వస్తుంది. వీటికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు, చేర్పులు చేయాల్సి వస్తుంది. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కనీసం నెల నుంచి నెలన్నర సమయం పడుతుందని నిపుణులు చెప్తున్నారు. ఈ లెక్కన ఆగస్టులో కూడా రైతుభరోసా అందడం అసాధ్యమని స్పష్టంచేస్తున్నారు. సెప్టెంబర్‌లో పెట్టుబడి సాయం అందే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

వరుసగా రెండోసారి

సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తాజా ప్రకటనతో ప్రభుత్వం వరుసగా రెండోసారి పెట్టుబడి సాయాన్ని ఆలస్యం చేయనున్నట్టు స్పష్టమవుతున్నదని రైతులు వాపోతున్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9నే రైతుభరోసా నిధులు వేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హడావుడి చేసిన సంగతి తెలిసిందే. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఆలస్యంగా పంపిణీని ప్రారంభించి, మే రెండోవారం వరకు కొనసాగించింది. ఈ దఫా కూడా ఇదే పరిస్థితి రానున్నది. ఇప్పటికే రైతులు అప్పులు తెచ్చి పంటలు వేస్తుండగా, పెట్టుబడి సాయం మాత్రం మరో రెండున్నర నెలల తర్వాత కోతలు ప్రారంభమయ్యే సమయంలో అందే అవకాశాలున్నాయని నిపుణులు చెప్తున్నారు.

ముకుతాడు ఎవరికి?

- ఇద్దరు మంత్రులకు 'అధికారిక సమాచారం' బాధ్యతలు
- మిగతా మంత్రులను కట్టడి చేసేందుకేనని అనుమానాలు
- మీడియాకు లీకులపై క్యాబినెట్‌లో వాడివేడి చర్చ

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాలకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని మీడియాకు అందించే బాధ్యతను మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అప్పగిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇతర మంత్రులను ముఖ్యంగా ముగ్గురు సీనియర్లను కట్టడి చేసేందుకే సీఎం రేవంత్‌రెడ్డి ఇలాంటి నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. క్యాబినెట్‌లోని కొందరు సీనియర్ మంత్రులు తన మాట వినడం లేదని, మీడియాకు తరుచూ లీకులు ఇస్తున్నారని సీఎం భావిస్తున్నట్టు రాజకీయ వర్గాల్లో కొన్నాళ్లుగా గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం అంతర్గతంగా తీసుకుంటున్న నిర్ణయాలు, చర్చిస్తున్న అంశాలను కూడా కొందరు అత్యుత్సాహంతో బయటికి చెప్తుండటంతో నష్టం వాటిల్లుతున్నదని సన్నిహితుల దగ్గర అసహనం వ్యక్తంచేసినట్టు సమాచారం. మరోవైపు కొందరు మంత్రులు సైతం తమ శాఖకు చెందిన సమాచారం ఇతర మంత్రులు ఎలా చెప్తారంటూ సీఎంకు ఫిర్యాదు చేసినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అధికారిక సమాచారాన్ని అందించే బాధ్యతను ఆ ఇద్దరు మంత్రులకు అప్పగించారని చెప్పుకుంటున్నారు. మంత్రులంతా తమ శాఖల అంశాలను మాత్రమే మాట్లాడాలని సీఎం ప్రెస్‌మీట్‌లో చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో మంత్రులు ఇతర అంశాలు మాట్లాడొద్దని కట్టడి చేయడంతోపాటు ఒకవేళ మాట్లాడినా వాటికి ఎలాంటి విలువ ఉండదని సీఎం బహిరంగంగానే చెప్పినట్టయ్యింది. అయితే, ఈ నిర్ణయం ఎవరిని ఉద్దేశించి తీసుకున్నారనే చర్చ మొదలైంది. ముగ్గురు సీనియర్ మంత్రులను కట్టడి చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. వారు ప్రెస్‌మీట్ పెట్టినప్పుడు అన్ని అంశాలపై మాట్లాడుతున్నారని, తమకు సన్నిహితులైన జర్నలిస్టులకు లీకులు ఇస్తున్నారని సీఎం దృష్టికి వచ్చినట్టు చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే 'కట్టడి' చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం.

'ఇన్‌సైడ్' చెప్పాడ్దు?

మీడియాకు వరుసగా లీకులు ఇస్తుండటంపై క్యాబినెట్ సమావేశంలో చర్చించినట్టు తెలిసింది. సీఎంతో మంత్రుల సమావేశాలు, క్యాబినెట్ సమావేశాలు, ఉప సంఘం సమావేశాల సందర్భంగా జరిగే చర్చల గురించి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటికి చెప్పొద్దని ముఖ్యమంత్రి స్పష్టంచేసినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. విషయాలు బయటికి వెళ్తే మంత్రుల మధ్య అనైక్యత ఉన్నదని బయట చర్చ జరుగుతున్నదని అనుకున్నట్టు తెలిసింది. అందుకే అధికారిక సమాచారం ఇచ్చే బాధ్యతను ఇద్దరు మంత్రులకు ఇవ్వాలని చర్చించి, నిర్ణయం తీసుకున్నారని సమాచారం. దీంతోపాటు క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ జరిగినట్టు తెలిసింది. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశాలు ముగిసిన తర్వాత పెట్టాలా? లేదా కొనసాగుతుండగానే బడ్జెట్ ప్రవేశపెట్టొచ్చా? అని చర్చించినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రానికి ఏ మేరకు నిధులు వస్తాయో తెలుస్తాయని, కాబట్టి పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతుండగానే రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టుకోవచ్చని అధికారులు చెప్పినట్టు సమాచారం. దీనిపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని తెలిసింది.

హైటెక్స్‌లో ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఉత్తమ్

అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- రైస్ మిల్లర్లకు మంత్రి ఉత్తమ్ సూచన
- హైటెక్స్‌లో ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో ప్రారంభం

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): రైస్ మిల్లర్లు అత్యాధునిక యంత్రాలను, సాంకేతికతను అందిపుచ్చుకోవాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆయన హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇంటర్నేషనల్ రైస్ అండ్ గ్రెయిన్స్ టెక్ ఎక్స్‌పో-2024ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రైస్ మిల్లింగ్, నాణ్యమైన బియ్యం ఉత్పత్తిలో తెలంగాణను నంబర్‌వన్ రాష్ట్రంగా మార్చడంలో మిల్లర్లకు సంపూర్ణ తోడ్పాటు అందజేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో రైస్ మిల్లింగ్‌ను ప్రధాన పరిశ్రమగా గుర్తించి దాదాపు 3 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నట్టు చెప్పారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విషయంలో ప్రభుత్వ నిబంధనలకు కట్టుబడి ఉండాలని మిల్లర్లను కోరారు. ప్రభుత్వం కిలో రూ.40 చొప్పున బియ్యాన్ని కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న బియ్యాన్ని దారిమళ్లిస్తున్న మిల్లర్లపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

కటాఫ్ తేదీలు ఖరారు

మొదటిపేజీ తరువాయి...

పొందుపరుస్తామని తెలిపారు. రోడ్లు, కొండలు, గుట్టలకు, రియల్ ఎస్టేట్ భూములకు, ధనికులకు రైతు భరోసా ఇస్తున్నారనే చర్చ జరుగుతున్నదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పారదర్శకంగా పెట్టుబడి సాయం అందించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమిస్తున్నట్టు ప్రకటించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు, ఇతర వర్గాలతో చర్చలు జరిపి జూలై 15లోగా ప్రభుత్వానికి నివేదిక అందిస్తుందని చెప్పారు. ఈ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి అందరి సూచనలతో పారదర్శకంగా అమలు చేస్తామని తెలిపారు.

మంత్రులు తమ శాఖకే పరిమితం..

క్యాబినెట్ నిర్ణయాలు, ప్రభుత్వ పరిపాలనాపరమైన నిర్ణయాలను వెల్లడించే బాధ్యతను మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అప్పగించినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వారిద్దరు ఇచ్చే సమాచారమే ప్రభుత్వ అధికారిక సమాచారమని స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఎలాంటి సందేహాలు ఉన్నా వారిద్దరినే అడగాలని చెప్పారు. మిగతా మంత్రులు తమ శాఖలకు సంబంధించిన సమాచారానికి మాత్రమే పరిమితం కావాలని సూచించారు.

బీఆర్ఎస్ రుణమాఫీ.. రూ.28వేల కోట్లు

గత పదేండ్లలో కేసీఆర్ నేతృత్వంలోని ప్రభుత్వం రెండుసార్లు రుణమాఫీ చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మొదటిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 2014 మార్చి 31వ తేదీని కటాఫ్‌గా నిర్ణయించి.. రూ.16వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందని చెప్పారు. ఆ తర్వాత రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు 2018 డిసెంబర్ 11వ తేదీని కటాఫ్‌గా పేర్కొని, రెండోసారి రూ.12వేల కోట్లు రుణమాఫీ చేసిందని వెల్లడించారు. మొత్తంగా కేసీఆర్ ప్రభుత్వం రెండు దఫాల్లో కలిపి రూ.28వేల కోట్ల రుణాలను మాఫీ చేసిందని తెలిపారు.

ప్రజావాణికి 575 దరఖాస్తులు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారానికి మొత్తం 575 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు. రెవెన్యూ సమస్యలపై 185, హౌసింగ్‌కు 64 దరఖాస్తులు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, పౌరసరఫరాల శాఖలకు సంబంధించి 50, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 43, హోం శాఖకు సంబంధించి 42 దరఖాస్తులు, ఇతర శాఖలకు సంబంధించి 191 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

సచివాలయంలో మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

సచివాలయంలో మహిళా శక్తి క్యాంటీన్

- ప్రారంభించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): గ్రామీణ మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో రెండు మహిళా శక్తి క్యాంటీన్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మహిళా శక్తి క్యాంటీన్లలో ఆహారం రుచి అమ్మ చేతి వంటలా ఉండాలి. నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలి. ఇప్ప పువ్వు లడ్డులాంటి పల్లె రుచులను పట్టణాలకు పరిచయం చేయాలి. ఈ క్యాంటీన్లు ఓ బ్రాండ్‌గా ఎదిగి దేశానికే ఆదర్శంగా నిలువాలి' అని సూచించారు. స్థానిక వనరులు, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా శక్తి బిజినెస్ మాడల్స్ రూపొందిస్తామని, రానున్న ఐదేండ్లలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందిస్తామని మంత్రి తెలిపారు. మీ సేవ, ఆధార్ కేంద్రాలు, పౌల్ట్రీ, డెయిరీ వ్యాపారాలు, క్యాంటీన్లు, స్టార్టప్‌ల ఏర్పాటుకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించడంతోపాటు వడ్డీలేని రుణ సౌకర్యాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ముఖ్యమంత్రి కార్యదర్శులు మానిక్ రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, సెర్ప్ డైరెక్టర్‌లు గోపాల్ రావు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏటా 40 వేల కోట్ల ఆదాయాన్ని ఇస్తున్నాం

- కార్పొరేషన్‌పై తప్పుడు వార్తలొద్దు
- జూపల్లితో బేవరేజెస్ ఉద్యోగులు

మంత్రి జూపల్లితో బేవరేజెస్ ఉద్యోగులు

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వానికి ఏటా రూ.40 వేల కోట్ల ఆదాయాన్ని సమకూర్చుతున్న తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌పై కొందరు వ్యక్తులు, మీడియా సంస్థలు బురదజల్లడాన్ని ఉద్యోగులు తీవ్రంగా ఆక్షేపించారు. తమకు అండగా నిలవాలని కార్పొరేషన్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘం నాయకులు, తెలంగాణ ప్రభుత్వ రంగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు శుక్రవారం ఎక్సైజ్ మంత్రి జూపల్లి కృష్ణారావునిను కలిసి విన్నవించారు. కొన్ని మీడియాల్లో వస్తున్న అసత్య వార్తలను ఖండిస్తూ వాస్తవాలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఒక టెండర్ కమిటీ ఉంటుందని, ఆ కమిటీలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి, రిటైర్డ్ ఐఏఎస్, కంపెనీ సెక్రట్రరీ, సీఏలతో నియమించిన కమిటీ మద్యం అమ్మకాలు, కొనుగోళ్లు, తయారీకి సిఫారసు చేస్తుందని తెలిపారు. ఇకనుంచైనా తప్పుడు వార్తలు రాయకుండా చూడాలని కోరారు. సంస్థపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలని విన్నవించారు. తాను కూడా ఉద్యోగుల పక్షానే ఉంటానని జూపల్లి హామీ ఇచ్చారు. అనంతరం ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్‌ను కలిసి సమస్యలు విన్నవించారు.

బేవరేజెస్ కార్పొరేషన్ జీఎంపై బదిలీ వేటు?

మౌకికంగా ఆదేశాలు జారీ చేసిన మంత్రి?

హైదరాబాద్, జూన్ 21 (నమస్తే తెలంగాణ): కొత్త మద్యం కంపెనీలకు ఇచ్చిన అనుమతులు వివాదాస్పదం కావడంతో.. ఈ వ్యవహారంలో కిందిస్థాయి ఉద్యోగులను బాధ్యులను చేసే ప్రయత్నం జరుగుతున్నది. తనకు తెలియకుండా కంపెనీలకు అనుమతులు ఇచ్చారని పేర్కొన్న ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహాంపై బదిలీవేటు వేసేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. ఈ మేరకు ఎక్సైజ్ కమిషనర్‌కు మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఇక అధికారిక ఉత్తర్వులు వెలువడటమే తరువాయి అని బేవరేజెస్ కార్పొరేషన్ ఉద్యోగులు పేర్కొన్నారు. కృత్రిమంగా మద్యం కొరతకు కారణమైన ప్రభుత్వపెద్దలు.. తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు అధికారులపై వేటు వేయడం ఎంతవరకు సమంజసమనే వాదన వినిపిస్తున్నది. కొత్త మద్యం కంపెనీలకు ఇచ్చిన అనుమతులను తాత్కాలికంగా నిలిపివేసిన ప్రభుత్వం.. అధికారులపై బదిలీ వేటు వేయడం సిగ్గుచేటని అంటున్నారు.

దక్షిణ మధ్య రైల్వే

Follow us on X @SCRailwayindia

దయచేసి రైల్వే యొక్క తాజా ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.inపై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన (http://ireps.gov.in ద్వారా)

దిగువ తెలిపిన పనుల కొరకు Dy.CEE/GS/SC, సికింద్రాబాద్‌వారు భారత రాష్ట్రపతి తరపున సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

క్ర.సం.: 01, **NIT నెం.** CE_29_GSU_ELEC_02_2024-25, **టెండరు నెం.:** CE_29_GSU_ELEC_02_2024-25, తేది: 19-06-2024. **పని పేరు:** 1) STBD యార్డు యొక్క సుల్తానాబాద్ అప్‌గ్రేడేషన్ - SC డివిజన్‌లో నిజామాబాద్ ఎండ్ వద్ద రోడ్ నెం. 2 మరియు రోడ్ 3 మధ్య క్రాస్ ఓవర్ కనెక్షన్ మరియు రోడ్ నెం. 3, 4 పొడగింపు. 2) SC డివిజన్‌లో పెద్దపల్లి నిజామాబాద్ సెక్షన్‌లో నూకపల్లి మల్లియాల్ మరియు గంగాధర మధ్య కొత్త క్రాసింగ్ స్టేషన్ పూడూరు ఏర్పాటు చేయుట. 3) సుల్తానాబాద్: యార్డు అప్‌గ్రేడేషన్ - పెద్దపల్లి - నిజామాబాద్ సెక్షన్‌పై నిజామాబాద్ ఎండ్ వద్ద రోడ్ నెం. 2 మరియు రోడ్ 3 మధ్య క్రాస్ ఓవర్ కనెక్షన్ మరియు రోడ్ నెం. 3, 4 పొడగింపు - విద్యుత్ ఏర్పాట్లు. 4) పెద్దపల్లి - నిజామాబాద్ స్టేషన్‌లో నూకపల్లి మల్లియాల్ మరియు గంగాధర మధ్య కొత్త క్రాసింగ్ స్టేషన్ పూడూరు ఏర్పాటు చేయుట - విద్యుత్ ఏర్పాట్లు. **టెండరు ఖర్చు:** రూ. 48755804.30/-, **పూర్తిచేయు కాలం:** 9 నెలలు, ముగింపు తేది: 11-07-24న 15:00 గం.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ http:// ireps.gov.inకు లాగిన్ కాగలరు. 2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు. 3) బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరుదారులందరు కోరబడుచున్నారు. 4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరుదారులందరూ కోరబడుచున్నారు. 5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీచేయబడును) కొరకు గమనించగలరు.

A16739

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, గతి శక్తి, సికింద్రాబాద్.

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in దర్శించండి

మాట నిలుపుకోవటంలో కేసీఆర్ ఆదర్శం

- అధికారంలోకి రాగానే పెన్షన్లు పెంచారు
- రేవంత్ సర్కారు పెన్షన్ బాకీ 6,223 కోట్లు
- ఈ బకాయిని ఎగ్గొట్టేందుకు ప్రభుత్వం యత్నం
- ఆ డబ్బులతోనే రుణమాఫీ చేసే ప్రయత్నాలు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదర్శవంతుడు అని, అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లు పెంచారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కొనియాడారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. పేదల సంక్షేమానికి కట్టుబడి ఇచ్చిన మాటను కేసీఆర్ నిలబెట్టుకున్నారని, తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను పెంచి, అమలు చేశారని వెల్లడించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.1,000, రూ.2,000 పింఛనును లబ్ధిదారులకు సకాలంలో అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారని గుర్తుచేశారు. ఏపీలో ఇటీవల అధికారం చేపట్టిన చంద్రబాబు కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఏప్రిల్ నుంచి పెన్షన్లను అమలు చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్, చంద్రబాబును ఆదర్శంగా తీసుకోవాలని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా తన మాటను నిలబెట్టుకోవాలని సూచించారు. వితంతు, వృద్ధాప్య, దివ్యాంగుల పెన్షన్లను తక్షణమే పెంచి, డిసెంబర్ నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళల హక్కుల పరిరక్షణకు ఎమ్మార్పీఎస్ 17 ఏండ్లుగా ఉద్యమం చేస్తున్నదని తెలిపారు. వారి సంక్షేమానికి అడ్డుపడే ప్రభుత్వాన్ని కచ్చితంగా నిలదీస్తామని స్పష్టం చేశారు.

7 నెలల పెన్షన్ బాకీ 6,223 కోట్లు

రాష్ట్రంలో పెన్షన్‌దారులకు రేవంత్ సర్కారు 7 నెలలకు గానూ రూ.6,223 కోట్లు బాకీ పడిందని మందకృష్ణ తెలిపారు. ఆ డబ్బుతోనే రైతు రుణమాఫీ చేయాలని ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. అన్నిరకాల పింఛన్లపై ప్రతి నెల రూ.889 కోట్లు అవుతుందని, ఆ లెక్కన లబ్ధిదారులకు రూ.6,223 కోట్లు అందాలని వివరించారు. లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉద్యమం చేపడతామని తేల్చిచెప్పారు. రుణమాఫీ అమలు కోసం తర్జనభర్జన పడుతున్న రేవంత్ సర్కార్.. ఇతర శాఖల నిధులను మళ్లించి రుణమాఫీ అమలు చేయాలని చూస్తున్నదని విమర్శించారు. ఉన్నోన్ని కొట్టి లేనోనికి పంచాల్సిన ప్రభుత్వం.. లేనోన్ని కొట్టి భూములు, జాగాలు ఉన్న ఉన్నోడికి రుణమాఫీ రూపంలో పంచాలనుకుంటున్నదని ఆరోపించారు. దివ్యాంగులు రజనీకి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చినంత హడావుడి చేసి వ్యవసాయశాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం కట్టబెట్టి రేవంత్ దగా చేశారని మండిపడ్డారు. ఈ నెల 25న దివ్యాంగుల పోరాట హక్కుల సంఘాలతో రాష్ట్ర స్థాయి సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటి నుంచే పెంచిన పెన్షన్లతో బకాయిల విడుదల కోసం ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వెల్లడించారు. అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశం కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోత్కుపల్లి నర్సింహులు

మాదిగల ఉనికే లేకుండా చేస్తున్న రేవంత్‌రెడ్డి

మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు

ఖైరతాబాద్, జూన్ 21: తెలంగాణలో మాదిగల ఉనికే లేకుండా చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఆరోపించారు. మాదిగ శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి సురేందర్ సన్నిధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మొదటి నుంచి మాదిగలను మోసం చేస్తూ వస్తుందని, 80 లక్షల జనాభా కలిగిన మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మాదిగల్లో రాజకీయ చైతన్యం లేకపోవడం వల్లే ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. ఆంధ్రప్రదేశ్‌లో కాపులంతా ఒకే తాటిపై నిలబడడం వల్లే పవన్‌కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారని తెలిపారు. ఇప్పుడు ఆ కులానికి ఎంతో విలువ పెరిగిందని చెప్పారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మాదిగల ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఉస్మానియా అధ్యాపకుడు ప్రొఫెసర్ కాశీం, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్, గణేశ్, ప్రభాకర్, ఆంజనేయులు, డాక్టర్ సంజీవ్‌నాయక్, రజనీ, పవన్‌కుమార్, నారాయణ, వెంకటేశ్వర ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్ల కోసం ఢిల్లీ దాకా ఉద్యమం

- పాట్నా హైకోర్టు